
సాక్షి పల్నాడు

శనివారం । 6 । సెప్టెంబర్ । 2025



ఘనంగా మిలాద్ ఉన్ నబి

ఫిరంగిపురం: మిలాద్ ఉన్ నబి సందర్భంగా వేములూరిపాడు గ్రామంలో శుక్రవారం జెండాను ఊరేగించారు. అనంతరం చెట్టు వద్ద జెండాను ప్రతిష్టించారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 32,141 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 51,962 క్యూసెక్కులు వదులుతున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డు సమీపం లోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష కల్యాణం,అభిషేకాలు చేశారు.

న్యూస్‌రీల్

అక్రమ రవాణాపై ఉక్కుపాదం

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



దాచేపల్లి: యూరియా, రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అన్నారు. మండలం లోని పొందుగల రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్‌ను గురువారం అర్ధరాత్రి జిల్లా ఎస్పీ శ్రీనివాస రావుతో కలిసి కలెక్టర్ అరుణ్ బాబు ఆకస్మికం గా తనిఖీ చేశారు. సరిహద్దు చెక్ పోస్ట్ మీదుగా రాకపోకలు సాగించే వాహనాలను తనిఖీ చేస్తున్న తీరును పరిశీలించారు. యూరియా, రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోకుండా సరి హద్దు చెక్ పోస్టుల్లో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని కలెక్టర్ చెప్పారు. యూరియా, రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో గురజాల డీఎస్పీ జగదీష్, ఆర్డీవో మురళీకృష్ణ, తహసీ ల్దార్ జి. శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.

న్యాయ శాస్త్రంలో విశేష ప్రతిభ



నరసరావుపేట ఈస్ట్: న్యాయ శాస్త్ర విద్యలో పట్టణానికి చెందిన కొత్త నితిన్ భార్గవ్ నాలుగు బంగారు పతకాలు సాధించారు. విశాఖలోని దామోదరం సంజీవయ్య నేషనల్ న్యాయ విశ్వ విద్యాలయంలో 2019–24లో న్యాయ శాస్త్రం లో నితిన్ భార్గవ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. వర్సిటీలో శుక్రవారం నిర్వహించిన స్నాత కోత్సవంలో క్రిమినాలజీ అండ్ పెనాలజీ, లేబర్ లా, క్రిమినల్ లా, ఇన్ఫర్మేషన్ టెక్నాల జీలో టాపర్‌గా నిలిచి బంగారు పతకాలు అం దుకున్నారు. సుప్రీంకోర్టు, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు చేతుల మీదుగా నితిన్ భార్గవ్ ఈ పతకాలు అందుకున్నారు. నితిన్ భార్గవ్ తండ్రి కొత్త రామ్మోహన్ హైకోర్టు న్యాయవాదిగా వ్యవహరిస్తున్నారు. లా గ్రాడ్యు యేషన్ అనంతరం లండన్‌లోని కింగ్స్ కళాశా లలో సైబర్ లాలో మాస్టర్ ఇన్ లా డిగ్రీ పూర్తి చేసినట్టు రామ్మోహన్ తెలిపారు.

సాగర్ నీటిమట్టం 589 అడుగులు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటి మట్టం శుక్రవారం 589.00 అడుగులకు చేరింది. ఇది 309.0570 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 9,500, ఎడ మకాలువకు 7,029, ప్రధాన జలవిద్యుత్ కేం ద్రానికి 32,886, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరద కాలువకు 300 క్యూసెక్కులు విడుదలవుతోంది. సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 52,115 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 52,115 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

ముగిసిన నృసింహస్వామి పవిత్రోత్సవాలు



మంగళగిరి: మంగళాద్రిలో గల శ్రీ లక్ష్మీనృసిం హస్వామి పవిత్రోత్సవాలు శుక్రవారం వైభవం గా ముగిశాయి. ఉదయం నిత్య హోమం, ఉక్త హోమం, పూర్ణాహుతి, కుంభజల ప్రోక్షణ, కుం భాభిషేకం, మహదాశీర్వచనం నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి పవిత్రములతో ఆలయ ప్రదక్షిణ అనంతరం గ్రామోత్సవం జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు పవిత్రము లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిం చారు. సాయంత్రం స్వామి శ్రీదేవి భూదేవి సమేతుడై శ్వేత పుష్పాలంకార రథ గ్రామోత్స వంలో పాల్గొన్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొ న్నారు. ఉత్సవాన్ని ఆలయ ఈవో సునీల్ కుమార్ పర్యవేక్షించారు.

అంగరంగ వైభవంగా భూ వరాహ వ్రతం



తాడేపల్లి రూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై శుక్రవారం భూ వరాహ వ్రతాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళా శాసనాలతో వ్రతాన్ని ఘనంగా నిర్వహించామని తెలిపారు. సుమారు 150 జంటలు పాల్గొని, వరాహ స్వామిని దర్శిం చుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మెడికిల్ మాఫియా

మందుల షాపుల్లో అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. మత్తు మందులతోపాటు కాలం చెల్లిన మందులు, ఫిజీషియన్ శాంపిళ్లను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నారు. ఆపరేషన్ గరుడ పేరిట ఈగల్ బృందాలు మొదట్లో తనిఖీలు నిర్వహించాయి. అక్రమ ఔషధాలు గుర్తించి పలు షాపులను సీజ్ చేశారు. అయినప్పటికీ అక్రమార్కులు యథావిధిగా దందా కొనసాగిస్తున్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల కారణంగా ఔషధ నియంత్రణ అధికారులు ఈ మెడికల్ మాఫియాను ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో అక్రమ మందుల వ్యాపారం కొనసాగుతోంది.

- కాలం చెల్లిన మందులు, ఫిజీషియన్ శాంపిళ్ల విక్రయం
- గతంలో ఈగల్ బృందం తనిఖీల్లో వెలుగులోకి దారుణాలు
- నేటికీ ఆగని అక్రమార్కుల దందా
- అమ్మకాలపై కొరవడిన అధికారుల నిఘా
- అధికార పార్టీ నేతల అండతో రెచ్చిపోతున్న విక్రేతలు

గుట్టుచప్పుడు కాకుండా మత్తుమందుల అమ్మకం



నరసరావుపేట టౌన్: జిల్లా కేంద్రమైన నరసరా వుపేటలో మందుల మాఫియా చెలరేగుతోంది. ఇక్కడ కొన్ని షాపుల్లో మత్తుమందుల విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపి స్తున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నరసరా వుపేటలో ట్యాబ్లెట్స్‌లను సరఫరా చేసే డీలర్‌లు అధికంగా ఉన్నారు. లాభాల కోసం బ్రాండెడ్ కంపె నీలను పోలి ఉండే వాటిని తీసుకొచ్చి రాయలసీమ ప్రాంతంతో పాటు పలు జిల్లాలకు సరఫరా చేస్తుం టారు. దీంతోపాటు ఇతర రాష్ట్రాలకు సైతం అమ్మ కాలు జరుపుతుంటారు. నకిలీ మందులకు అడ్డాగా నరసరావుపేటకు పేరు ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమార్కులు మరో అడుగు ముందుకేశారు. మత్తు మందులను విక్రయించటంతోపాటు ఇతర ప్రాంతాలకు కొరి యర్, పార్శిళ్ల ద్వారా తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి ఘటనలు గతంలో కూడా వెలుగు చూశాయి. రెండేళ్ల క్రితం ఓ ఫార్మా కం పెనీలో ట్రామాడోల్ తయారు చేసినట్లు అధికారుల దాడుల్లో తేలింది. ఆ కంపెనీలో చాలా బ్రాండెడ్ మందులకు సంబంధించి నకిలీవి తయారు చేశారని ఆరోపణలు వచ్చాయి. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు మత్తుమందులు వస్తుండగా, ఇక్కడి నుంచి పలుచోట్లకు తరలుతున్నాయి.

కాలం చెల్లినా విక్రయాలు

జిల్లాలో సుమారు వెయ్యికి పైగా ఔషధ దుకాణాలు ఉన్నాయి. పలు షాపుల్లో కాలం చెల్లిన మందులు, ఫిజీషియన్ శాంపిళ్ల విక్రయాలు సాగుతున్నట్లు సమాచారం. ప్రజలకు తెలియకుండానే వీటిని అం టగడుతున్నారు. వాడిన వారు ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. పలు ప్రముఖ కంపెనీలు ప్రయోగం కోసం ఉచితంగా అందించే ఫిజీషియన్ శాంపిళ్లు మెడికల్ దుకాణాల్లో, కొన్ని వైద్యశాలలకు అనుబంధంగా ఉండే షాపుల్లో విక్రయించటం ఆం దోళన కలిగిస్తోంది. జనరిక్ మందులను కూడా బ్రాండెడ్ పేర్లతో ఎక్కువ ధరలకు అమ్ముతున్నార న్నారు. ఈగల్ బృందం తనిఖీల్లో సైతం దీనిని గుర్తించారు. ఆయా షాపుల లైసెన్స్‌ను తాత్కాలి కంగా నిలిపివేయగా, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో పునరుద్ధరించారు. ఇలా అక్రమ వ్యాపారం చేసినా ఏమి కాదనే రీతిలో పలువురు రెచ్చిపోతున్నారు. దీంతో మార్కెట్‌లోకి కాలం చెల్లిన మందులు ఇబ్బడిముబ్బడిగా వచ్చేస్తున్నాయి.

రెచ్చిపోతున్న మాఫియా

అధికార పార్టీ నేతల అండ చూసుకొని మెడి కల్ మాఫియా రెచ్చిపోతోంది. అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడంతో అక్ర మార్కుల ఆగడాలు హద్దుమీరాయి. ఈగల్ టీం దాడులు, అధికారుల తనిఖీలన్నీ కాగితా లకే పరిమితమయ్యాయి. దుకాణాల్లో నాణ్య మైన మందులు కొనుగోలు చేశామన్నా నమ్మకం కూడా సామాన్యులకు లేకుండా పోతోంది. ఇకనైనా అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యానికి చేటు తెచ్చే ఈ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.

రైతులను మోసగించిన కూటమి ప్రభుత్వం

- 9న రైతు ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి
- రైతులకు యూరియా ఇవ్వటంలో కూటమి ప్రభుత్వ ఘోర వైఫల్యం
- బ్లాక్ మార్కెట్‌ను తక్షణమే అరికట్టాలి
- ఎకరాకు 6 కట్టల యూరియా తక్షణమే సరఫరా చేయాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రైతుల సమస్యలపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన అన్ని రైతు కూలీ, ప్రజా సంఘాలను కలుపుకొని భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. రెవెన్యూ డివిజన్ల వారీగా ఆర్డీవోలకు వినతిపత్రాలు అం దిస్తామన్నారు. ఆయా డివిజన్ల పరిధిలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతులను తీవ్రంగా మోసం చేసిందని విమర్శించారు. రైతుల పక్షాన పోరాటం చేసే ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ మాత్రమేనని పేర్కొ న్నారు. తమ ప్రభుత్వంలో రైతు భరోసా కేం ద్రాలు ఏర్పాటుచేసి సకాలంలో ఎరువులు సర ఫరా చేశామని తెలిపారు. రూ.3 వేల కోట్ల ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించామన్నారు. ధాన్యానికి బస్తాకు రూ.3 వేలు, మిర్చికి రూ.20 వేల నుంచి రూ.24 వేల వరకు కొనుగోలు చేశామని గుర్తుచేశారు. సర్కార్ ధరల స్థిరీకరణ ఏర్పాటు చేయలేదని అన్నారు. ధాన్యం, కందులు, మిర్చి, పత్తికి గిట్టుబాటు ధర లేదని అన్నారు.

అప్రమత్తం చేసినా ఫలితం లేదు

యూరియా రైతులకు అందటం లేదని గతంలో తాము కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. రైతులు ఆధార్ కార్డు తీసుకెళ్తే ఒకటి, రెండు కట్టలు అందజేస్తు న్నారని అన్నారు. కలెక్టర్, అగ్రికల్చర్ అధికా రులు యూరియా సరిపడా ఉందని చెబుతున్నా రని, సరిపడా ఉంటే ఎందుకు నియంత్రణ చేసి ఇస్తున్నారని ప్రశ్నించారు. ఎకరానికి ఆరు కట్టలు అవసరమని అన్నారు. పల్నాడులో గతేడాది 82,000 హెక్టార్లలో వ్యవసాయం సాగుచేస్తే ఈ ఏడాది దాదాపు 97వేలు నుంచి ఒక లక్ష హెక్టార్లలో సాగుచేశారని, గతేడాది లెక్కల ప్రకారం 36 వేల టన్నులు అవసరమైతే ఇప్పటివరకు 34వేల టన్నులు మాత్రమే ఇచ్చా రని, ఇంకా 18 వేల హెక్టార్లకు అదనంగా యూరియా కావాల్సి ఉందన్నారు. ప్రభుత్వ పెద్దలు నిజమైన రైతుకి యూరియా అందించ కుండా బ్లాక్‌లో అమ్ముకొని సొమ్ము చేసుకుం టున్నారని విమర్శించారు. యూరియా బస్తా రూ.266లకు విక్రయించాల్సి వుండగా బ్లాక్‌లో రూ.400 నుంచి రూ.460లకు అమ్ముతున్నారని చెప్పారు. యూరియా అందుబాటులో లేదని దుష్ప్రచారం చేస్తున్నామని మాపై కేసులు పెట్టాలని ఎస్పీ మాట్లాడుతున్నారని, ఈనా డులో యూరియా కోసం రైతులు బారులు తీరి నిలబడుతున్నారని ఒక ఆర్టికల్ రాశారని మరి వారిపై కేసులు ఎందుకు పెట్టరని ప్రశ్నించారు. గ్రామస్థాయిలో టీడీపీ నాయకులు సంతకం పెడితేనే రైతుకు యూరియా ఇచ్చే పరిస్థితి తీసు కొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ దుకాణాల యజమానులు షరతులు పెడుతు న్నారని, తక్షణమే విజిలెన్స్, అగ్రికల్చర్ అధికా రులు పర్యవేక్షణ చేసి నియంత్రించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా రైతు విభాగ అధ్యక్షులు అన్నెం పున్నారెడ్డి, విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షులు గుజ్జర్లపూడి ఆకాష్‌కు మార్ పాల్గొన్నారు.

మరణాలపై వీడని మిస్టరీ

- భయం గుప్పెట్లో తురకపాలెం గ్రామస్తులు
- వ్యాధి నిర్ధారణ చేయలేకపోయిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఒక్కొక్కరిది ఒక్కో రకమైన స్టేట్‌మెంట్
- వైరస్ లేదని ఆరోగ్య శాఖ సత్యకుమార్ యాదవ్ ప్రకటన
- వైరస్ ఉందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని వెల్లడి
- రిపోర్టులు నార్మల్‌గా ఉన్నాయని డీఎంహెచ్ఓ స్టేట్‌మెంట్
- నెలల తరబడి చావులను కప్పి పెట్టింది ఎవరు?
- నివేదిక సమర్పించకుండా ఎందుకు దాచి పెట్టారు ?
- అధికారుల నిర్లక్ష్యానికి గ్రామం బలి అవ్వాల్సిందేనా ?
- వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యానికి ప్రాణాలు పోతున్నాయి
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో సర్వత్రా విఫలం



నిర్మానుష్యంగా తురకపాలెంలోని వీధి



వివరాలు తెలుసుకుంటున్న మంత్రి

సాక్షి ప్రతినిధి, గుంటూరు / గుంటూరు మెడికల్ : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తున్న గుం టూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామ ప్రజల మరణాలపై మిస్టరీ ఇంకా కొనసాగు తూనే ఉంది. కొద్దిరోజులుగా మీడియాలో వార్తా కథనాలు రావడంతో నిద్రలేచిన అధికార యం త్రాంగం గ్రామానికి కదిలింది. రాష్ట్ర ప్రజాప్రతిని ధులు సైతం గ్రామ బాట పట్టారు. మూడు రోజులుగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి వైద్య పరీక్షలు చేస్తున్నా.. ప్రజలకు ఆవగింజంత ఆత్మ విశ్వాసాన్ని కల్పించలేకపోతున్నారు. మేము న్నామంటూ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్టేట్ మెంట్ ఇచ్చినప్పటికీ ప్రజల్లో ఉన్న భయాందోళ నలు రవ్వంత కూడా తొలగిపోలేదు. కొన్ని నెల లుగా గ్రామ ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నా, అధి కార యంత్రాంగం నిద్రమత్తులో తూలుతుండ టంతో గ్రామం వల్లకాడును తలపిస్తోంది.


భిన్న ప్రకటనలతో గందరగోళం

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి గ్రామాన్ని శుక్రవారం సందర్శించి మీడియాతో మాట్లాడారు. గ్రామంలో 59 మంది రక్తనమూనాలు సేకరించి, పరీక్షలు చేశామని తెలి పారు. ఫలితాలు అనుమానించదగినవిగా లేవని, నార్మల్‌గా ఉన్నాయని చెప్పారు.
- కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ బర్కోల్డేరియా సూడోమలై అనే బ్యాక్టీరియా వల్ల జ్వరాలు వచ్చి కొందరు మరణిం చారని, మెలియాయిడోసిస్ అనేది చాలా అరుదైన వ్యాధి అన్నారు. గ్రామంలో ఎవరికీ సరైన అవగా హన లేకపోవడంతో తెలుసుకునేందుకు సమయం పడుతుందన్నారు.
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ గ్రామస్తులకు రక్త పరీక్షలు చేస్తున్నారని, మెలిడాయిసిస్ బ్యాక్టీరియా ఉన్నట్లు పరీక్ష ఫలితాలు రాలేదన్నారు.

మరణాలకు ఎప్పుడు ఫుల్‌స్టాప్ ?

రెండు నెలలుగా గ్రామంలో మరణ మృదంగం మోగుతోంది. రెండు నెలల అనంతరం కళ్లు తెరి చిన ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు మూడు రోజులుగా హడావుడి చేస్తున్నారు. గ్రామ ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని, భరోసాను కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, వ్యాధికి గల కార ణాలు, అందుకు అందుబాటులో ఉన్న చికిత్సలు, సదరు చికిత్సలు ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు అరకొరగా ఉన్నాయి.

గ్రామస్తుల్లో ఆందోళన



గ్రామస్తులు తాగుతున్న క్వారీలో నీరు

ఒకేరోజు గ్రామంలో ముగ్గురు మూడు రకాల స్టేట్‌మెంట్‌లతో గ్రామస్తులు ఆందోళన చెందు తున్నారు. వ్యాధి అనేది తెలియక మరింత భయాందోళనలతో ఉక్కిరిబిక్కిరి అవుతు న్నారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ లాంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అం దుబాటులో ఉన్నా, రెండు నెలలకు పైగా నిం డు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా అధి కారుల్లో చలనం లేదు. అధికారులు ఎందుకు నోరు మెదపడం లేదో అర్థం కాక, గ్రామ ప్రజలు సైతం తీవ్ర ఆగ్రహం, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు తేటతెల్లంగా కనిపించే వరకు తురకపాలెం గ్రామ స్తులు నిద్రపోయే పరిస్థితి లేదు.

వైద్య ఆరోగ్య శాఖ నిర్లిప్తత

గ్రామంలో ఏదైనా విపత్కర పరిస్థితులు తక్షణ కర్తవ్యంగా జిల్లా వైద్య అధికారులు జరు గుతున్న సంఘటనలపై జిల్లా ఉన్నతాధికారులకు, రాష్ట్ర ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేసి, అప్రమత్తం చేయాల్సి ఉంటుంది. కానీ గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పనితీరు అందుకు పూర్తి భిన్నంగా ఉంది. మరణాల గురించి మీడియా వెలుగులోకి తీసు కొచ్చే వరకు చలనం లేదు. విపత్తులు అంచ నాలు వేసేందుకు ఐడీఎస్‌పీ విభాగం ప్రత్యేకం గా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఉంది. సదరు విభాగం నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుండిపోవడం వల్లే రెండు నెలలుగా గ్రామం వల్లకాడుగా మారింది. గుం టూరు వైద్య కళాశాల ఎస్‌పీ ఎం వైద్య విభాగం సైతం విప త్కర పరిస్థితులు తలెత్తినప్పుడు గ్రామాలకు వెళ్లి వ్యాధులకు కారణాలు, మరణాలకు కారణాలు విశ్లేషించాలి. సమగ్ర నివేదిక ప్రభుత్వానికి అం దించి, మరణాలు, వ్యాధుల కట్టడికి కృషి చేయా ల్సిన నైతిక బాధ్యత ఉంది. ఎస్‌పీఎం వైద్య విభాగం నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరించడం వల్లే నేడు ఓ చిన్న గ్రామం రాష్ట్రవ్యాప్తంగా సంచ నాలకు నిలయంగా మారింది. లక్షలాది మంది ప్రజల్లో భయాందోళనకు కారణంగా నిలిచింది.

తురకపాలెంలో వరుస మరణాలపై పరిశీలన

- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- బర్కోల్డేరియా సూడోమలై అనే బ్యాక్టీరియా వల్లే జ్వరాలు
- మెలియాయిడోసిస్ అరుదైన వ్యాధి

గుంటూరు రూరల్: మండలంలోని తురకపాలెం లో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశే ఖర్ శుక్రవారం పర్యటించారు. గ్రామంలో బాధి తుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హెల్త్ క్యాంప్‌ను పరిశీలించారు. వైద్య సిబ్బందిని అడిగి పలు వివరాలు తెలుసుకున్నారు. అనం తరం మాట్లాడుతూ బర్కోల్డేరియా సూడోమలై అనే బ్యాక్టీరియా వల్ల జ్వరాలు వచ్చి కొందరు మరణించారని చెప్పారు. మెలియాయిడోసిస్ అనేది చాలా అరుదైన వ్యాధి అని, దాని వల్ల శరీ రంలో రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్నవారికి ఇబ్బందులు వస్తాయని వివరించారు. యాంటీబ యాటిక్ ద్వారా జబ్బు తగ్గించవచ్చని చెప్పారు. నాలుగైదు రకాలు మాత్రమే పనిచేస్తాయని తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు పరి హారం విషయం ఆలోచిస్తున్నామని తెలిపారు. కేవలం తాగు నీటి ద్వారా బ్యాక్టీరియా వ్యాపించ దని, గాలి, నీరు, మట్టి తేమ స్థాయి ఎక్కువగా ఉంటే వ్యాపిస్తుందని వివరించారు. అరుదైన వ్యాధి కాబట్టే గుర్తించడంలో ఆలస్యం జరిగింద ని, పరీక్షల ఫలితాలు రావడానికి ఎక్కువ సమయం పడుతుందని చెప్పారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడారు.



ఉత్తమ పౌరులను అందించే బాధ్యత ఉపాధ్యాయులదే

- ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంపీ, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు

నరసరావుపేట ఈస్ట్: సమాజానికి ఉత్తమ పౌరులను అందించే బాధ్యత గురువులపైన ఉందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యం లో శుక్రవారం ప్రకాష్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పుర స్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా రాధాకృ ష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఎంపీ శ్రీకృష్ణదేవ రాయలు మాట్లాడుతూ మారుతున్న విద్యా వ్యవస్థకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధనలో నైపుణ్యాలను పెంచుకోవాలని అన్నారు. విద్యార్థులలో పరిశీలనాత్మక, పరిశో ధనాత్మక ఆలోచనలు పెంపొందించేలా గుణాత్మక విద్యను అందించాలని సూచిం చారు. విద్యారంగానికి అవసరమైన అన్ని మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు.

ప్రతి విద్యార్థిపై శ్రద్ధ అవసరం

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ విద్యార్థి జీవితాన్ని పాఠశాల స్థాయి ఉపాధ్యా యుడు ప్రభావితం చేస్తారని తెలిపారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కనీసం పదాలు రాయలేని పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నో వసతులను కల్పిస్తున్నప్పటికీ విద్యార్థులు ఎం దుకు వెనుకబడి ఉంటున్నారని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కె.వి జయ కుమార్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉత్తమ సేవలు అందించి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన వారిని సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



రొంపిచర్ల: స్థానిక మార్కెట్ యార్డులోని జీడీసీఎంఎస్ ఎరువుల గోదాంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరేపల్లి గ్రామంలోని రైతుసేవా కేంద్రాన్ని కూడా తనిఖీ చేశారు. ఎరువులు రైతులకు అమ్మిన వెంటనే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. రియల్ టైంలో అమ్మిన ఎరువులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. రసాయన ఎరువుల వివరాలను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అవసరం లేకుండా యూరియా కొనుగోలు చేసి ఇండ్లలో స్టాక్ చేయవద్దని రైతులకు సూచించారు. గోదాంలోని ఎరువుల బస్తాలకు, స్టాక్ రిజిస్టలతో సరి చూశారు. తనిఖీల్లో ఏడీఏ కె.వి.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి శివలలిత, వ్యవసాయ విస్తరణ అధికారులు బ్రహ్మయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పులిచింతలకు 34,126 క్యూసెక్కులు విడుదల



సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి దిగువ నున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు 34,126 క్యూసెక్కులు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్‌ఈ వెంకట రమణ, ఈఈ సుబ్రమణ్యం శుక్రవారం తెలిపారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు మూడు క్రస్ట్‌గేట్లును 1.50 మీటర్లు, ఒక క్రస్ట్‌గేటును ఒక మీటర్ ఎత్తు ఎత్తి 25,492 క్యూసెక్కులు, రెండు యూనిట్లు ద్వారా విద్యుత్ ఉత్పాదన అనంతరం 8,634 క్యూసెక్కులు మొత్తం 34,126 క్యూసెక్కులు దిగువ నున్న పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 75.50 మీటర్లు కాగా 75.50 మీటర్లకు చేరుకుందన్నారు. ప్రాజెక్టు రిజర్వాయర్‌లో గరిష్ట నీటి సామర్థ్యం 7.080 టీఎంసీలకుగాను ప్రస్తుతం 7.080 టీఎంసీలు ఉందన్నారు. టీఆర్‌సీ లెవల్ 55.62 మీటర్లకు చేరుకుందన్నారు. ఎగువ నాగార్జునసాగర్ నుంచి వచ్చే వరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాలి

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగ నాయకుల డిమాండ్



సమావేశంలో పాల్గొన్న విద్యార్థి విభాగ నాయకులు

నరసరావుపేట: గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన విద్యా సంస్కరణలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం నీరుగారుస్తోందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షులు గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్ మాట్లాడారు. మాజీ సీఎం జగన్ రూ.8,850 కోట్లతో 17 మెడికల్ కళాశాలల నిర్మాణాలకు చర్యలు తీసుకోగా అందులో ఐదింటిని పూర్తిచేసి తరగతులు కూడా ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు వాటిని ప్రైవేటీకరణ చేసేందుకు పావులు కదుపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్య అందించడం ఇష్టంలేని ముఖ్యమంత్రి చంద్రబాబు మెడికల్ కౌన్సిల్‌కు సీట్లు అవసరం లేదని లేఖ రాశారని పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావటం తెలుగు రాష్ట్ర ప్రజల దురదృష్టకరం అన్నారు. ఆయన పాలన బినామీల ప్రయోజనాల కోసమే అన్నట్లుగా సాగుతుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలలు అందుబాటులోకి వస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేరు వస్తుందనే దుగ్ధతో చంద్రబాబు ఈ పాపానికి వడిగడుతున్నాడన్నారు. ఈ జీఓను వెనక్కి తీసుకోకపోతే పార్టీ తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కోటపాటి మణికంఠారెడ్డి, బూదాల కల్యాణ్, ఉప్పతోళ్ల వేణుమాధవ్, బంటి, షోయబ్ పాల్గొన్నారు.

యూట్యూబ్ ద్వారా నేర్చుకుని చోరీలు

- పాత నేరస్తుడు అరెస్ట్
- హత్య కేసులోనూ నిందితుడు



స్వాధీనం చేసుకున్న నగలు, ల్యాప్‌ట్యాప్‌లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: పార్కింగ్ చేసిన కార్ల అద్దాలను పగులకొట్టి నగదు, నగలు, ల్యాప్‌ట్యాప్‌లు దొంగలించే పాత నేరస్తుడ్ని అరెస్ట్ చేసినట్లు గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. రూ.6 లక్షల ఖరీదైన ల్యాప్‌టాప్‌లు, 11 గ్రాముల బంగారం, రూ.2 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గుంటూరు నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాలులో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ కేసు వివరాలు వెల్లడించారు. గడిచిన రెండు నెలలుగా కార్ల అద్దాలను పగులకొట్టి నగలు, నగదు, ల్యాప్‌ట్యాప్‌లను తస్కరిస్తున్నారు. వరుస ఘటనలపై బాధితులు ఆయా పోలీస్‌స్టేషన్లల్లో ఫిర్యాదులు చేశారు. ఈ తరహా సంఘటనలు నల్లపాడు పీఎస్ పరిధిలో నాలుగు, నగరంపాలెం పీఎస్ పరిధిలో మూడు జరిగాయి. దీంతో సీసీఎస్, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల (పీఎస్) పోలీస్ అధికార, సిబ్బందిని అప్రమత్తం చేశారు. చిన్న క్లూ ఆధారంగా చేసుకుని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి, నిందితుడిని గుర్తించామని ఎస్పీ చెప్పారు. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గొరిజవోలు గ్రామ వాసి 33 ఏళ్ల జంగం బాజిని అదుపులోకి తీసుకుని విచారించామని తెలిపారు. నేరం రుజువుకావడంతో అరెస్ట్ చేశామన్నారు. అతని నుంచి రూ.6 లక్షల ఖరీదైన ల్యాప్‌ట్యాప్‌లు, 11 గ్రాముల బంగారం, రూ.2 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నల్లపాడు పీఎస్ పరిధిలో– 4, నగరంపాలెం పీఎస్ పరిధిలో– 3, పెదకాకాని పీఎస్, పాత గుంటూరు పీఎస్, అరండల్‌పేట పీఎస్ పరిధిలో ఒక్కొక్క కేసు నిందితుడిపై నమోదైందని వివరించారు.

రౌడీషీట్ కూడా..

2022లో పల్నాడు జిల్లా నరసరావుపేట ఒకటో పట్టణ పీఎస్ పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో బాజీ నిందితుడని, రౌడీషీట్ కూడా ఉందని ఎస్పీ తెలిపారు. చోరీలు చేసే విధానాన్ని యూట్యూబ్ ద్వారా నేర్చుకున్నాడని చెప్పారు. చేతులకు గ్లౌజ్‌లు, తలకు హెల్మెట్ ధరించి, గులక రాళ్లతో కార్ల అద్దాలను ధ్వంసం చేసేవాడని విచారణలో తెలిసినట్లు వివరించారు. చాకచక్యంగా వరుస కేసులను ఛేదించిన నల్లపాడు పీఎస్ సీఐ వంశీధర్, సీసీఎస్ సీఐ అనురాధ, ఎస్ఐ చల్ల వాసు, హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు, కానిస్టేబుళ్లు సాంబశివరావు, భిక్షునాయక్, మస్తాన్‌వలిని జిల్లా ఎస్పీ అభినందించారు. అనంతరం ప్రశంసా పత్రాలు అందించారు. సమావేశంలో దక్షిణ సబ్ డివిజనల్ డీఎస్పీ భానోదయ, నల్లపాడు పీఎస్ సీఐ వంశీధర్ పాల్గొన్నారు.

సాధారణ స్థాయిలో రక్త పరీక్ష నమూనాలు

- నేడు బ్లడ్ కల్చర్ రిపోర్టులు రాక
- డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామ బాధితుల నుంచి సేకరించిన రక్త నమూనాల పరీక్ష ఫలితాలు క్రమంగా వెలువడుతున్నాయని శుక్రవారం సాయంత్రం వరకు సుమారు 59 రక్త నమూనాల పరీక్షల ఫలితాలు వెలువడ్డాయని, అందులో బయో కెమిస్ట్రీ విభాగంలో వెలువడిన ఫలితాలలో అనుమానించదగినవిగా లేవని డీఎంహెచ్‌వో విజయలక్ష్మి తెలిపారు. రిపోర్టులన్నీ సాధారణ స్థాయి (నార్మల్)లోనే ఉన్నాయన్నారు. బ్లడ్ కల్చర్ రిపోర్టులు వెలువడేందుకు మరో 24 గంటల సమయం పడుతుందన్నారు. ఈ ఫలితాలు వస్తేనే తురకపాలెం గ్రామంలో ఇన్ఫెక్షన్‌కు దారి తీసిన కారణాలపై స్పష్టత వస్తుందని తెలిపారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో చికిత్సపొందుతున్న తురకపాలెం గ్రామానికి చెందిన ఇద్దరి ఆరోగ్యం నిలకడగా ఉందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ తెలిపారు. తురకపాలెం గ్రామంలో కొనసాగుతున్న 2 వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయని, వీటి ద్వారా స్థానికులకు సీబీపీ, ఎల్ఎఫ్‌టీ(లివర్ పరీక్ష), ఆర్ఎఫ్‌టీ(కిడ్నీ), సీయూఈ రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నారన్నారు. ఈ వైద్య శిబిరాలలో ఉన్న జనరల్ మెడిసిన్, మానసిక వైద్యులు, కమ్యూనిటీ మెడిసిన్ వైద్యుల ద్వారా స్థానికులకు వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తెనాలి రూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొలకలూరు రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు ఘటనాస్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. సుమారు 50 ఏళ్ల వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్టు గుర్తించారు. మృతుడు లేత ఆకుపచ్చ చొక్కా, తెలుపు మీద ఎరుపు, నలుపు గళ్ల చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహం వద్ద టర్కీ టవల్ ఉండడంతో రైతు అయి ఉంటాడని భావిస్తున్నారు. ఛిద్రమైన మృతదేహం భాగాలను తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 7207076614 నంబరులో సంప్రదించాలని ఎస్ఐ జి. వెంకటాద్రిబాబు సూచించారు.

గణేష్‌నిమజ్జనంలో అపశ్రుతి

గుండెపోటుతో వ్యక్తిమృతి



బొల్లాపల్లి: వెల్లటూరులో శుక్రవారం జరిగిన గణేష్ నిమజ్జన కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌పార్టీ కార్యకర్త గంగనబోయిన గోవిందరాజులు (29) శుక్రవారం ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని గుండెపోటుతో కుప్పకూలిపోయి మృతిచెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడు గోవిందరాజులుకు భార్య భూలక్ష్మి తోపాటు ఇరువురు సంతానం ఉన్నారు. మృతుని కుటుంబాన్ని స్థానిక వైఎస్సార్ పార్టీ నాయకులు పరామర్శించారు.

వీవీఐటీ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన జర్మనీ బృందం



పెదకాకాని: జర్మనీలోని అతి పెద్ద నైపుణ్య శిక్షణ సంస్థ డెక్రా అకాడమీ ప్రతినిధులు మండలంలోని నంబూరు వీవీఐటీ విశ్వవిద్యాలయంలోని సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. రాష్ట్ర యువతలో నైపుణ్య కార్యక్రమాలను మెరుగుపరచడానికి, ప్రపంచ ఉపాధి అవకాశాలను సులభతరం చేసేందుకు గాను నియమితులైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు (అంతర్జాతీయ నైపుణ్య, ఉద్యోగ కల్పన) సీతాశర్మతో కలసి శుక్రవారం యూనివర్సిటీని సందర్శించారు. విద్యార్థులకు అందించే శిక్షణ గురించి సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ రావెల నవీన్ బృందానికి వివరించారు. సీతాశర్మ మాట్లాడుతూ జర్మనీ ప్రస్తుతం నైపుణ్యం గల నిపుణుల కొరతను ఎదుర్కొంటోందని తెలిపారు. నిర్మాణం, ఇంజినీరింగ్, సమాచార సాంకేతిక వంటి రంగాల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలున్నాయని చెప్పారు. ఇండో జర్మన్ సమష్టి కృషితో యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి, పరిశ్రమ అవసరాలకు తగ్గట్టు శిక్షణను అందించడం ద్వారా అంతర్జాతీయ నియామకాలు అందించవచ్చని సూచించారు.

అప్పాపురం ఛానల్‌లో మునిగి యువకుడు మృతి



మృతి చెందిన యువకుడు సైలేష్

చేబ్రోలు: వినాయక విగ్రహ నిమజ్జనం కోసం వచ్చి అప్పాపురం ఛానల్‌లో ఈత కోసం దిగి ప్రమాదవశాత్తూ నీట మునిగి యువకుడు మృతిచెందిన సంఘటన చేబ్రోలులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నల్లచెరువు గాంధీనగర్ ప్రాంతానికి చెందిన ఎం సైలేష్ (18) తన స్నేహితులతో కలిసి గురువారం రాత్రి గుంటూరు నుంచి చేబ్రోలు కొమ్మమూరు చానల్‌లో నిమజ్జనం కోసం బయలుదేరారు. మార్గంమధ్యలో అప్పాపురం ఛానల్ వద్ద మృతుడు సైలేష్ అతనితోపాటు మరో ఇరువురు స్నేహితులు ఆగి ఛానల్‌లో ఈత కోసం దిగారు. కొంత సేపు తరువాత అతని స్నేహితులు వరుణ్, షన్నులు సైలేష్ అప్పాపురం ఛానల్‌లో గల్లంతైన విషయాన్ని గమనించి కుటుంబసభ్యులకు తెలియజేశారు. రాత్రి సమయంలో గాలించినప్పటికి ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం ఛానల్ నీటి పరిమాణం తగ్గించి ఎన్‌డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపట్టడంతో మునిగిపోయిన కొంతదూరంలో మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా బీచ్ ఫెస్టివల్ నిర్వహణ

అధికారులకు కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశం



మాట్లాడుతున్న బాపట్ల కలెక్టర్

బాపట్ల: బీచ్ ఫెస్టివల్‌ను అంగరంగ వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. నిర్వహణపై అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులతో శుక్రవారం తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో సూర్యలంక, రామాపురంలో బీచ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దక్షిణ భారత స్థాయిలో బీచ్ క్రీడా పోటీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేడుకలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఫెడ్ లైట్ల మధ్య వాలీబాల్, ఖోఖో, బాక్సింగ్, ఫెన్సింగ్ తదితర క్రీడా పోటీలు భారీ స్థాయిలో నిర్వహించాలని చెప్పారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పండుగలా జరపాలని ఆయన సూచించారు. పర్యాటకుల సౌకర్యార్థం 100 ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాల కోసం తెలుగు సినీ రంగం నుంచి కళాకారులను పిలిపిస్తున్నట్లు పేర్కొన్నారు.
మధ్యలో సరదాగా ఉండడానికి జబర్దస్త్ బృందాల ప్రదర్శన ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రసిద్ధ గాయకులతో పాటు సినీ రంగ నటులు, ప్రముఖుల సైతం ఈ కార్యక్రమానికి ఆహ్వానించాలని కలెక్టర్ తెలిపారు. డాన్సర్లు, మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేయాలన్నారు. తీర ప్రాంతంలో బోట్ల ప్రదర్శన, స్పీడ్ బోట్లు, స్పోర్ట్స్ రైడర్స్, గుర్రాలు, ఒంటెలు ప్రదర్శన ఉండాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. 350 మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. వేలాదిమంది కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డెప్యూటీ కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, జిల్లా పర్యటకశాఖ అధికారి నాగిరెడ్డి, ఆర్డీవో గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా కమిటీ నియామకం



నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా ఎస్సీ విభాగ కమిటీని నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అధ్యక్షులుగా కొమ్ము చంద్రశేఖర్‌బాబు (మాచర్ల), ఉపాధ్యక్షులుగా పెద్దింటి నాగేశ్వరరావు (సత్తెనపల్లి), దావలి పెదవెంకటేశ్వర్లు (పెదకూరపాడు), ప్రధాన కార్యదర్శులుగా పులిమెల మాణిక్యం (మాచర్ల), సాతులూరి రమేష్ (గురజాల), బేతం గాబ్రియేలు(వినుకొండ), పంగులూరి విజయకుమార్ (నరసరావుపేట), పండుల బుల్లెబ్బాయ్ (చిలకలూరిపేట), కార్యదర్శులుగా తంబాటి మల్లయ్య (మాచర్ల), కాలే మాణిక్యాలరావు (గురజాల), కొచ్చర్ల రాజారత్నం (చిలకలూరిపేట), కిన్నెర దేవయ్య (వినుకొండ), నేలటూరి సురేష్ (నరసరావుపేట), యనమల సింగయ్య (సత్తెనపల్లి), కంభంపాటి భాస్కరరావు (మాచర్ల)లను నియమించారు. ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా తంగిరాల మేరిబాబు, బత్తుల సాగర్‌బాబు (మాచర్ల), పల్లమిశాల కిషోర్, కోట వెంకటరావు(వినుకొండ), బందెల వెంకటరావు, చింతిరాల నాగార్జున నటరాజ్ (నరసరావుపేట), ప్రత్తిపాటి కోటేశ్వరరావు, దేవంగి మరియబాబు (సత్తెనపల్లి), తుమ్మలగుంట రమేష్‌బాబు, యామర్తి రవి (చిలకలూరిపేట), మందడపు నాగయ్య, చిలకల శ్రీకాంత్, కంపెర్ల రోశయ్య (పెదకూరపాడు), చల్లగుండ్ల స్వామి, బండ్ల ఏసుపాదం (గురజాల) నియమితులయ్యారు.

రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలకు చంద్రగ్రహణం

వైఎస్సార్‌సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్



పిడుగురాళ్ల: రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు చంద్ర గ్రహణం పట్టిందని వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ విమర్శించారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయాలని రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయం లోపభూయిష్టంగా ఉందని అన్నారు. కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ము కాయడం చంద్రబాబునాయుడు నైజం అని మరోసారి రుజువైందన్నారు. చంద్రబాబునాయుడు పాలన అంటేనే ప్రైవేటు వ్యవస్థకి కేంద్ర బిందువని అన్నారు. దాదాపు 15 సంవత్సరాలకుపైగా ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు ఒక్క మెడికల్ కాలేజీ అయినా ఈ రాష్ట్రానికి తీసుకురాగలిగరా అని ప్రశ్నించారు. ఒక్కసారి ముఖ్యమంత్రి అయిన జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తీసుకొచ్చారని తెలియజేశారు. వాటిని చంద్రబాబు ప్రైవేట్ పరం చేయడానికి పూనుకున్నారని అన్నారు. ప్రజల కోసం పోరాటం చేయడానికి రాజకీయాల్లోకి వచ్చామని చెప్పే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దీనిపై నోరు మెదపకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు. అధికారపక్షంలో ఉండి మీరు ఇప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా మెడికల్ కళాశాలల ప్రైవేటు పరం ఆలోచనకు స్వస్తి పలకాలని ఆయన కోరారు.

ఇరువర్గాలపై కేసులు నమోదు



కారుమంచిలో పోలీసు పికెట్‌ను పరిశీలిస్తున్న వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్‌రావు

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషనులో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశామన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీసు పికెట్‌ను వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు పరిశీలించి సిబ్బందికి దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. గ్రామంలో ఎటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు నిఘా ఉంచామన్నారు. ఆయనతోపాటు రైటరు షేక్ బాషా, ఎస్‌బీ కానిస్టేబుల్ రమేష్, శివ పోలీసు సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రంలో అతిపెద్ద సంఘం ఏపీ ఎన్జీజీవో

రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్



మాట్లాడుతున్న విద్యా సాగర్

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యవర్గం, అన్నీ తాలూకా కార్యవర్గ సభ్యులతో స్థానిక ఎన్జీజీవో హోంలో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి రమణలు కొత్త జిల్లాల పునర్విభజన సందర్భంగా నూతన ఆడహాక్ కార్యవర్గ సభ్యుల ఎన్నిక సమావేశం శుక్రవారం ఎన్జీవో రిక్రియేషన్ హాలులో జరిగింది. సమావేశానికి గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. అలపర్తి విద్యాసాగర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో తమ సంఘం 205 తాలూకాలతో అత్యధిక సంఖ్యలో ఉద్యోగ సంఘాలతో కలిసి అతిపెద్ద జేఏసీ సంఘంగా ఉద్యోగుల ప్రయోజనాల కోసం పనిచేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ మాట్లాడుతూ సంఘాన్ని పటిష్టపరిచేందుకు ప్రతి ఒక్క సభ్యుడు సహాయ సహకారాలు అందించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్‌లు మాట్లాడుతూ ఉద్యోగుల ప్రయోజనాలు సాధించడంలో తాము శాయ శక్తుల కృషి చేస్తామని చెప్పారు.
ఏఎస్ఎంలు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను, పదోన్నతి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అడహాక్ కమిటీ చైర్మన్‌గా ఎం.రామకృష్ణ, కన్వీనర్ కే.నాగేశ్వరరావు, ట్రెజరర్ బ్రహ్మహేశ్వరరావు, సభ్యులు రామయ్య, అప్పారావు, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావులను నియమించారు. వీరి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు జరిగి నవంబర్ నాటికి ఏ.పీ ఎన్జీజీవో సంఘ పల్నాడు జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఏర్పడుతుందని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు జగదీష్, రంజిత్ నాయుడు, రామ్ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు, ఏఐజీఎఫ్ మహిళ విభాగ కన్వీనర్ రాజ్యలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్, జిల్లా నాయకులు సుకుమార్, కూరాకుల శ్రీనివాసరావు, శ్రీవాణి, కృష్ణకిషోర్, సయ్యద్ జానీబాషా, విజయ్, విజయలక్ష్మి, నగర అధ్యక్ష కార్యదర్శులు సూరి కళ్యాణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. పలువురు ఎన్జీవో నాయకులు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

విజయ్‌కుమార్‌కు ఆర్థిక సాయం

గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్టు మేల్ నర్సుగా విధులు నిర్వహిస్తున్న వి.విజయ్‌కుమార్ అమెరికాలో అక్టోబరులో జరగనున్న వరల్డ్‌కప్ పారాసిట్టింగ్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనేపథ్యంలో శుక్రవారం గుంటూరులోని ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ చేతుల మీదుగా జిల్లా నేతలు విజయకుమార్‌కు రూ.10వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, సెక్రటరీ శ్యామ్‌సుందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

యువత భుజస్కంధాలపై భారత్ భవిత

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: భారత్ ఉజ్వల భవిత యువత భుజస్కంధాలపై ఉందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో ఏటుకూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నలంద, తక్షశిల వంటి విశ్వవిద్యాలయాల ద్వారా ప్రపంచ మానవాళికి జ్ఞానమందించిన ఘనమైన మన భారత సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. దేవుడిపై ఎంత భక్తి, గౌరవం ఉంటాయో, జ్ఞానాన్ని అందించే గురువుపై కూడా అంతే శ్రద్ధాభక్తులు ఉండాలని చెప్పారు. రమేష్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ పోతినేని రమేష్ బాబు మాట్లాడుతూ మనం నేర్చుకున్న జ్ఞానం, నైపుణ్యాలను సరైన మార్గంలో నడిపించేవారే గురువని అన్నారు. జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ అంకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నల్లబోతు మురళి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, ఏ వృత్తిలో రాణించాలన్న గురువుల పాత్ర అమూల్యమైనదని పేర్కొన్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు జీవితంలో ఎంతో సాధించిన ప్రేరణాత్మకమైన వ్యక్తులను వారికి పరిచయం చేస్తున్నట్లు చెప్పారు. వారి అనుభవసారాన్ని వినమ్రంగా గ్రహించి లక్ష్యసాధనకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. సభకు భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు అధ్యక్షత వహించారు. తొలుత అతిథుల చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్, డాక్టర్ రమేష్, డాక్టర్ మురళీలను భాష్యం చైర్మన్ భాష్యం రామకృష్ణ సత్కరించారు. విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతుల్ని అలరించాయి. అనంతరం అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.